# పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదు ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు

● నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, ఏప్రిల్,09(సమయం న్యూస్) :** "ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు"ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసులు "ఇంటి వద్దే ఎఫ్ఐ ఆర్ నమోదు" విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసులు బాధితుల నివాసానికి లేదా వారికి అనుకూలమైన ప్రదేశానికి వెళ్లి ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో పోలీసులే బాధితుడి వాంగ్మూలాన్ని వారి భాషలో నమోదు చేసి, చదివి వినిపించి సంతకం తీసుకొని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రతిని అందజేస్తారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు మరియు బలహీన వర్గాల వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహ నిరోధక చట్టాలకు సంబంధించిన కేసుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని తప్పనిసరిగా పంపిస్తారు. అవసరమైతే ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం నమోదు చేస్తారు. పోలీసులు సంఘటన స్థలాన్ని రక్షించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే ప్రారంభిస్తారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ప్రక్రియ వేగవంతమవుతుంది, ఆలస్యం తగ్గుతుంది, అలాగే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ఇబ్బంది తగ్గుతుంది. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కోరారు. నారాయణపేట జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.

## చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన 3 రోజుల మెడికల్ క్యాంపును ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు.



**చంచల్ గూడ ఏప్రిల్9( సమయం న్యూస్) :** ఈ క్యాంపులో ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ, ఇతర ఆరోగ్య పరీక్షలు చేసేందుకు ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూరాష్ట్రంలో ప్రతి పౌరుని మెరుగైన వైద్య సేవలు అందించి, వారి ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నానన్నారుఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఈరోజు రాష్ట్రవ్యాపంగా హెచ్ఐవీపై అవేర్‌నెస్ కార్యక్రమాలు, స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేశాం. జైళ్లలో ఉన్న ఖైదీల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం. ఇకపై ప్రతి 3 నెలలకు ఒకసారి జైళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్లు, అవసరమైన దయాగ్నసిస్ సర్వీసులతో కూడిన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తాంఆరోగ్యశాఖ, జైళ్ల శాఖ సమన్వయంతో పని చేస్తూ ఖైదీలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయి. తెలంగాణ జైళ్లను ఆశ్రమాల తరహాలో నిర్వహిస్తున్న జైళ్ల శాఖ అధికారులకు అభినందనలు.



అంబర్ పేట అలీ కేఫ్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలు పుష్ప మృతి

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 కార్యక్రమం



లో భాగంగా నేడు నిర్మల్ జిల్లాలోని ముధోల్ నియోజకవర్గంలోని 4 మండలాల ప్రశిక్షణ తరగతుల్లో ముధోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ గారు,బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ గారు పాల్గొని,ప్రసంగించడం జరిగింది.

◈ సంస్థ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో సాన్నిహిత్యం వంటి అంశాలపై సమగ్ర మార్గనిర్దేశం అందిస్తూ బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశ్యం.

◈ భవిష్యత్ రాజకీయ, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేలా కార్యకర్తలను తీర్చిదిద్దుతూ సమర్థవంతమైన నాయకత్వాన్ని రూపొందించేందుకు ఈ కార్యక్రమం ఒక బలమైన వేదికగా నిలుస్తుంది.

◈ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి ఆలోచనలు, అంత్యోదయ సూత్రం, సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా పార్టీ కార్యకర్తలు కట్టుబడి పని చేయాల్సిన అవసరాన్ని వివరించడం జరిగింది. ఈ ప్రశిక్షణ కార్యక్రమానికి వక్తలుగా బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ గారు, రవి పాండే గారు,నగర్ నారాయణ రెడ్డి గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి యాతాళం చిన్నారెడ్డి గారు, జిల్లా ఉపాధ్యక్షులు గాలి రవి గారు, నల్లా రమేష్ గారు, తాడేవార్ సాయి నాథ్ గారు, పట్టణ అధ్యక్షులు రావుల రాము గారు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో బీజేపీ ప్రశిక్షణ మహాభియాన్

**నిర్మల్, ఏప్రిల్ 9:** పండిట్ దీన్ దయల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్–2026లో భాగంగా నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ , బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ హాజరై ప్రసంగించారు. కార్యకర్తలకు సంస్థ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో అనుబంధం వంటి అంశాలపై మార్గనిర్దేశం చేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. అంత్యోదయ సూత్రాన్ని ప్రస్తావిస్తూ, సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో ఈ శిక్షణలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయుడు గోపీనాథ్ పదవీ విరమణ సన్మానం

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మరియు అధికారులు



**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్ 09:(సమయం న్యూస్) :** కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన గోపీనాథ్ ను పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ హాజరై గోపీనాథ్ ను శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని, గోపీనాథ్ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఎంతోమందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్ర, 2వ వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ యాదవ్, మండల విద్యాధికారులు ) రామ్ రెడ్డి, హరి లాల్, మాజీ ఎంఈఓ వెంకట్రామ్ రెడ్డి, మరియు కొండన్న పాల్గొని గోపీనాథ్ సేవలను ప్రశంసించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షులు అబ్దుల్ హక్ మరియు ప్రధాన కార్యదర్శి దినేష్ సింగ్ లు మాట్లాడుతూ..గోపీనాథ్ తమ సంఘం పట్ల మరియు వృత్తి పట్ల చూపిన అంకితభావం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. సన్మానం అందుకున్న గోపీనాథ్ మాట్లాడుతూ.. తన విధి నిర్వహణలో సహకరించిన తోటి ఉపాధ్యాయులకు, సంఘం నాయకులకు మరియు అధికారులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల నాయకులు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. పీఆర్టీయూ మండల శాఖ,కొడంగల్.

# "యూనిఫాం, అవినీతి రెండూ కలిసి ఉండలేవు..

శాంతి భద్రతలను కాపాడవలసిన వారు అక్రమ సంపాదనకు అలవాటు పడితే కఠిన చర్యలు తప్పవు" అంటూ బాధ్యతలు చేపట్టిన వెంటనే డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి రాష్ట్రంలోని పోలీసు సిబ్బందికి రాసిన లేఖలో అత్యంత స్పష్టంగా హెచ్చరించారు. హోమ్ గార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో, పారదర్శకతతో పనిచేయాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే పేదలు మరియు బలహీన వర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించి వారికి న్యాయం చేయాలని డిజిపి తన లేఖలో ఉద్ఘాటించారు. పోలీస్ స్టేషన్లను సివిల్ సెటిల్మెంట్లకు వేదికగా మార్చవద్దని, క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. అయితే డీజీపీ స్థాయి అధికారి ఇంతటి కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు తమ పాత పద్ధతులను మార్చుకోవడం లేదనే విషయం ఏసీబీవరుస దాడులతో స్పష్టమవుతోంది. ప్రస్తుతం ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా పర్యవేక్షణలో అవినీతి నిరోధక శాఖ రాష్ట్రవ్యాప్తంగా తన వేగాన్ని పెంచింది. తాజాగా, శంషాబాద్‌లోని ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్ అవుట్‌పోస్టులో ఇన్‌స్పెక్టర్ సంపాతి కనకయ్య మరియు ఎస్సై యు.కె. సిద్ధేశ్వర్ ఒక కేసులో చార్జ్ షీట్ దాఖలు చేసేందుకు, నిందితుల కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయకుండా ఉండేందుకు రూ. 5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ. 2 లక్షలు తీసుకుంటుండగా



ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నివాసంలో సోదాలు చేయగా ఏకంగా రూ. 33,97,000 నగదు లభ్యమైంది. వీరిని బుధవారం నాడు రిమాండ్ కు తరలించారు. అలాగే మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఆర్మ్డ్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ప్రమోద్ గౌడ్, జాతావత్ బాబు నాయక్ ఒక సైబర్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేయకుండా ఉండేందుకు లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అవినీతి జాడ్యం కేవలం నగరాలకే పరిమితం కాకుండా జిల్లాల్లోనూ కొనసాగుతుండటం గమనార్హం. నిర్మల్ జిల్లా మామడ ఎస్సై టి. అశోక్ తనపై ఉన్న ఫిర్యాదును మాఫీ చేసేందుకు రూ. 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడగా, మాదాపూర్ ఎస్సై గాంధ్ర వినయ్ నోటీసులు ఇచ్చేందుకు రూ. 50 వేలు డిమాండ్ చేసి ఏసీబీ వలలో చిక్కారు. వరంగల్‌లోని కేయూసీ ఎస్సై పి. శ్రీకాంత్ సీజ్ చేసిన వాహనాల విడుదల కోసం తన ప్రైవేట్ డ్రైవర్ ద్వారా రూ. 15 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని ములుగు ఎస్సై విజయ్ కుమార్ రూ. 50 వేలు, మెదక్ జిల్లా టేక్మల్ ఎస్సై రాజేష్ నోటీసుల జారీ కోసం రూ. 30 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. టేక్మల్ ఎస్సై అయితే ఏసీబీ అధికారులను చూసి పొలాల్లోకి పారిపోగా, అధికారులు వెంటాడి పట్టుకోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా పోలీసు సిబ్బంది తమ పనితీరును మార్చుకొని, డిజిపి తన లేఖ లో ఆశించినట్లుగా "ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ మరియు ప్రొఫెషనల్" పోలీసింగ్ వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీజీ చారుసిన్హా ప్రజలను కోరుతున్నారు.

# అంగన్వాడీ టీచర్ల కు స్మార్ట్ఫోన్ పంపిణీ

**కరీం నగర్ ఏప్రిల్9( సమయం న్యూస్). :** TNGO భవన్ లొ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ టీచర్స్ కి గౌరవ కరీంనగర్ మీాూ గంగుల కమలాకర్, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, ాఖణాూ చైర్మన్ నరేందర్ రెడ్డి చేతుల మీదుగా కొత్త ఫోన్లు పంపిణి చేయడం జరిగింది. 17 మంది దివ్యంగులకి తీవ్తీశీటఙ్వ‌ఎశీశీతీ జవష్ట్రఅఎశ్రీవం ఇవ్వడం జరిగింది ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లొ భాగంగా గ్రోత్ డ్రైవ్ నిర్వహించి ఆరోగ్యం గా ఉన్న పిల్లలకి బహుమతి ప్రదానం చేయడమైనది. ఈ నెల 9 నుంచి 23 వరకు జరిగే పోషణ పక్షం కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. గౌరవ మీాూ గారు మాట్లాడుతూ లబ్ధిదారులు అందరు అంగన్వాడీ సేవలు ఉపయోగించు కోవాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లు అందజేసి పరదర్శిక మైన సేవలకు నాంది పలికారని అన్నారు. మేయర్ మాట్లాడుతూ పోషణ అభియాన్ యాప్, అమలును సులభతరం చేయడం, డేటా నమోదు ప్రక్రియను వేగవంతం చేయడం ప్రధాన ఉద్దేశ్యం. కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ లొ ఉన్న అంగన్‌వాడీ టీచర్లు కు శాంసంగ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసి పంపిణీ చేసాము అని. ఈ ఫోన్లలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సర్వే వివరాలు, పిల్లల సమాచారం, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య వివరాలను నమోదు చేయగలరు. ఒక్కో ఫోన్ ధర సుమారు రూ. 11,650 ఫోన్లలో 4+దీ =ూవీ, 64+దీ





మెమరీ వంటి ఫీచర్లు ఉన్నాయి. డేటా ఎంట్రీ, యాప్ వినియోగం సులభంగా ఉండేలా ప్రత్యేకంగా ఎంపిక చేశారు అని అన్నారు. పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయ్. ఈ కార్యక్రమం లొ కరీంనగర్ మీాూ గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, ాఖణాూ చైర్మన్ నరేందర్ రెడ్డి Dwo సరస్వతి, Cdpo సబిత,dmho వెంకట రమణ Supervisors, పోషణ అభియాన్ దీజ,అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నార

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

**భూపాల పల్లి ఏప్రిల్9( సమయం న్యూస్) :** గురువారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నీటి సరఫరా, డ్రైనేజి సిస్టం, మంచినీరు, విద్యుత్తు, బయో మెడికల్ వేస్టేజ్, ఇంటర్ నెట్ సౌకర్యం, అంబులెన్స్, పార్కింగ్ షెడ్స్, ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్స్, ఫైర్ సేఫ్టీ, క్యాజువాలిటీ, డైట్, లాబోరేటరీస్, దయాలసిస్ వింగ్, హ్యూమన్ రిసోర్స్, బ్లడ్ బ్యాంక్, ఫైనాన్సియల్ ఇష్యూస్, బడ్జెట్ రిక్వయిర్ మెంట్ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన నిధులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలి పారు. ప్రజలకు సత్వర, సమర్థవంతమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ఆసుపత్రిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రత, పారిశుధ్యం, రోగుల సౌకర్యాలు మెరుగుపరచడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డిజిటల్ సేవలు, రిజిస్ట్రేషన్ విధానం సులభతరం చేయడంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కోమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



# సరస్వతి నగర్ భూమిని పట్టాగా మార్చాలి

**ఇందిరమ్మ కాలనీ నుంచి తమ సర్వే నంబర్లు తొలగించాలని వినతి**

**తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు**



**ఆర్మూర్, ఏప్రిల్ 9 (సమయం న్యూస్):** ఆలూర్ మండల కేంద్రంలోని సరస్వతి నగర్‌కు చెందిన పట్టా భూమి సర్వే నంబర్‌ను ఇందిరమ్మ కాలనీలో కలిపినందున అధికారులు విచారణ చేసి సరిచేయాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 113లోని వివిధ ఉప విభాగాల పట్టా భూములు తమకు సంబంధించినవని వివరించారు. ఈ ప్రాంతంలో గత 15 ఏళ్ల నుంచి ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నామని వారు తెలిపారు.

**రికార్డులు సరిచేయాలని విన్నపం**

తమ పట్టా భూమికి చెందిన సర్వే నంబర్లను ఇందిరమ్మ కాలనీ సర్వే నంబర్లతో కలిపి పిఓపిగా నమోదు చేశారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఏళ్ల నుంచి తాము నివాసం ఉంటున్న భూములను తప్పుగా నమోదు చేసినందున తహసీల్దార్ విచారణ జరిపి తిరిగి పట్టా భూమిగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరస్వతి నగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి

**జిల్లా కేంద్రంలో వేడుకలకు కలెక్టర్ పిలుపు**

**అధిక సంఖ్యలో పాల్గొనాలని కోయ శ్రీ హర్ష ప్రకటన**



**పెద్దపల్లి, ఏప్రిల్ 9 (సమయం న్యూస్):** ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 14న ఉదయం 10 గంటలకు బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ చౌరస్తాలో ఈ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

**పదివేల రూపాయలు వసూలు చేస్తుండగా పట్టుబడ్డ శ్రీమాన్**

**భూమి విచారణ కోసం రైతును వేధించిన అధికారి**



**పెద్దపల్లి, ఏప్రిల్ 9 (సమయం న్యూస్):** పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీమాన్ పదివేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. రాయదండి గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామి భూమి విచారణకు సంబంధించి పదివేల రూపాయలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐకి రైతు డబ్బులు ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ ఘటనపై వెంటనే కేసు నమోదు చేసిన అధికారులు సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారణ నిర్వహించారు. అనంతరం ఆర్ఐ శ్రీమాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని కరీంనగర్ ప్రత్యేక కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

# కడప డీఈఓకు గుండెపోటు



**అనంతపురం, ఏప్రిల్ 9 (సమయం న్యూస్ ప్రతినిధి) :** అనంతపురం జిల్లా డీఈఓ కడప ప్రసాద్ బాబు గుండెపోటుకు గురయ్యారు. పది తరగతి పబ్లిక్ పరీక్షల విధుల్లో భాగంగా స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలో ఉండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. సహచర ఉద్యోగులు వెంటనే నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, పరీక్షల్లో గుండె నాళంలో బ్లాక్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ఆయన్ని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. త్వరలోనే స్టెంట్ వేయనున్నట్లు వైద్య బృందం వెల్లడించింది. ప్రస్తుతం ప్రసాద్ బాబు ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని సేవలందిస్తున్నారు. ఎప్పుడూ సహృదయంతో అందరితో కలిసిమెలిసి ఉండే ప్రసాద్ బాబు త్వరగా కోలుకోవాలని సహచరులు, స్నేహితులు ఆకాంక్షిస్తున్నారు.




# హజ్ యాత్రికులలకు లోటు రానివ్వొద్దు..

- **ఇది మన బాధ్యత: మంత్రి ఎన్ఎండీ ఫరూక్**
- **విజయవాడ ఎంబార్కేషన్ ఏర్పాటు ఒక చారిత్రక విజయం..**
- **ఏపీ యాత్రికులకు రూ. లక్ష ఆర్థిక సాయం.. దేశంలోనే ఇది ఆదర్శం!**

**గన్నవరం, ఏప్రిల్ 9 (సమయం న్యూస్):** "రాష్ట్రం నుండి పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులకు సకల సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి అలసత్వం వహించకూడదు. విమానాశ్రయం నుండి సౌదీ చేరే వరకు వారికి రాజమర్యాదలు అందాలి" అని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ అధికారులను ఆదేశించారు. గురువారం గన్నవరంలో హజ్ క్యాంప్ ఏర్పాట్లపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. "గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్‌లో హజ్ భవన్ నిర్మించి, ఎంబార్కేషన్ కేంద్రం వచ్చేలా చేశారు. ఇప్పుడు రాష్ట్ర విభజన తర్వాత ఏపీ యాత్రికుల ఇబ్బందులను గమనించి, ప్రధాని మోదీ గారితో మాట్లాడి విజయవాడను ఎంబార్కేషన్ కేంద్రంగా మంజూరు చేయించారు. ఇందుకోసం కృషి చేసిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గారికి కూడా ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. "కన్వెన్షన్ హాలులో బస చేసే యాత్రికులకు మంచినీరు, భోజనం, వసతి విషయంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున గొడుగులు సిద్ధం చేయాలి. విజయవాడ నుండి వెళ్లే ప్రతి యాత్రికుడికి మన ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ ప్రయోజనం ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి." అని అన్నారు. "పోలీస్, వైద్య, విమానాశ్రయ అధికారులు సమన్వయంతో పనిచేయాలి. 18న ముఖ్యమంత్రి బస్సులను ప్రారంభించే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి. హజ్ యాత్రికులకు సేవ చేయడం ఒక పవిత్రమైన కార్యం. సౌదీలో వారు దిగిన తర్వాత కూడా ఆహారం, వసతి విషయంలో ఇబ్బందులు లేకుండా అక్కడి అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలి" అని మంత్రి అధికారులను కోరారు. విజయవాడ నుండి మొదటి విడతగా వెళ్తున్న 335 మంది యాత్రికుల ప్రయాణం సురక్షితంగా, సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# సాంకేతికతతోనే వ్యవసాయంలో లాభాలు

- **వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచన**
- **పామాయిల్ సాగు, చేపల పెంపకానికి ప్రాధాన్యం**



**మెదక్, ఏప్రిల్ 9 (సమయం న్యూస్):** కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులు ఆధునిక సాంకేతికతను వాడుకుంటూ విభిన్న పంటల సాగు ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పంటల వివిధీకరణ అత్యంత అవసరమని, వరి వంటి సంప్రదాయ పంటలపైనే కాకుండా పప్పుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, పండ్ల తోటల వంటి ప్రత్యామ్నాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పంట మార్పిడి, నీటి మితవ్యయం ద్వారా సాగులో స్థిరత్వం సాధించవచ్చని ఆమె వివరించారు.

**అనుబంధ శాఖల ప్రగతిపై దిశానిర్దేశం**

పశువులకు గాలి కుంట వ్యాధి సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలని, పశువైద్య మందులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వడంతో పాటు కొత్త గ్రామాల్లో సంఘాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మత్స్యకార మహిళలకు చేపల వంటకాల తయారీలో శిక్షణ ఇచ్చి ఉపాధిని పెంచాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలని, పామాయిల్ తోటల వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు దేవకుమార్, వెంకటయ్య, మల్లేశం, ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

# వరిగుంతంలో వైభవంగా బోనాల ఊరేగింపు

**శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు**

**ముదిరాజ్ కులస్థుల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు మొక్కులు**



**కొల్చారం, ఏప్రిల్ 9 (సమయం న్యూస్):** వరిగుంతం గ్రామంలో రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు బోనాల ఊరేగింపును గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ముదిరాజ్ కులస్థులు ఈ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేశారు. అంతకుముందు అమ్మవారి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. శివసత్తుల ఆటపాటలు, డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ మేఘమాల సంతోష్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ వేడుకల్లో మాజీ పీఏసీఎస్ చైర్మన్లు నరసింహులు, ప్రభాకర్, గోవర్ధన్ సహా పలువురు ప్రముఖులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పిల్లల వికాసానికి వేదికగా పార్కులు

**డబ్ల్యూఆర్ఐ ప్రతినిధులతో మేయర్ సుధారాణి సమీక్ష**

**'నర్చరింగ్ నైబర్‌హుడ్'తో పార్కుల్లో రక్షణ చర్యలు**

**వరంగల్, ఏప్రిల్ 9(సమయం న్యూస్):** పార్కులు పిల్లల మానసిక వికాసానికి తోడ్పడాలని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. గురువారం బల్దియా కార్యాలయంలో 'నర్చరింగ్ నైబర్‌హుడ్ 2.0' కార్యక్రమంలో భాగంగా డబ్ల్యూఆర్ఐ ప్రతినిధులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. బాల్యదశ అభివృద్ధికి, తల్లిదండ్రుల శ్రేయస్సుకు తోడ్పడేలా సామాజిక మార్పు దిశగా అధికారులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు. పార్కుల్లో ఆడుకునే పిల్లల రక్షణ కోసం అంతర్జాతీయ స్థాయి నియమ నిబంధనలను పాటించాలని మేయర్ ఆదేశించారు. తొలి దశలో బాలసముద్రం చిల్డ్రన్ పార్క్, సుందరయ్య నగర్, కీర్తి నగర్ పార్కుల్లో డబ్ల్యూఆర్ఐ అందించే డిజైన్ల ప్రకారం అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తారని తెలిపారు. వడ్డేపల్లి బండ్ పై ఏర్పాటు చేయనున్న 'ఈట్ స్ట్రీట్' డిజైన్లను కూడా ఆమె పరిశీలించారు. సమావేశంలో అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, రవికుమార్, సంతోష్ బాబు తదితరులు పాల్గొన్నారు.